01022025-MAI-04_Layout 1 2/1/2025 3:08 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# పెన్షన్‌దారులకు రిక్త'హస్తం'

ప్రభుత్వ ఉద్యోగులు 'పదవీ విరమణ' అనే ఘట్టాన్ని అనేక బాధ్యతల పరిష్కార మార్గంగా భావిస్తారు. మూడు దశాబ్దాల పాటు పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత వచ్చే ప్రయోజనాలను ఏ విధంగా వాడుకోవాల్నో ఏడాది ముందునుంచే రకరకాలుగా ప్రణాళికలు వేసుకుంటారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో 'పదవీ విరమణ' అంటేనే ఉద్యోగులు నిస్పృహకు గురవుతున్నారు. 'పదవీ విరమణ' పొందిన కొన్నిరోజుల తర్వాత అందుకునే బెనిఫిట్స్ ఈ ప్రభుత్వ హయాంలో ఏడాది తర్వాత కూడా రాకపోవడమే అందుకు కారణం.



జి.దేవిప్రసాద్ రావు
90006 33404




**2024,** మార్చి నుంచి రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 8 వేల మంది ఉద్యోగులు వివిధ క్యాడర్లలో పదవీ విరమణ పొందారు. 2025లో 9,630, 2026లో 9,780, 2027లో 10,302, 2028లో 8,760.. మొత్తంగా రానున్న నాలుగేండ్లలో దాదాపు 38 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందే అవకాశం ఉన్నది. వీరి ప్రయోజనాలు సుమారు రూ.20 వేల కోట్లుగా ఉంటాయని ఆర్థికశాఖ అంచనా. అంటే ఏటా 4 నుంచి 5 వేల కోట్ల వరకు ఏయేడుకాయేడు బడ్జెట్‌లో కేటాయిస్తే కానీ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు దక్కవు. ఈ ఆర్థికభారం నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు పదవీ విరమణ వయస్సు పెంపు ఒక మార్గంగా భావిస్తున్నది.

2014, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరినాక పదవీ విరమణ వయస్సు పెంచాలని ఉద్యోగ సంఘాల నుంచి వినతులు వచ్చినా, ఆ వినతులను కేసీఆర్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. కానీ, ఏపీ ప్రభుత్వం పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏండ్లకు పెంచింది. దీంతో తెలంగాణలోనూ ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలనే డిమాండ్ రూపుదిద్దుకున్నది. ఉద్యోగ సంఘాల వినతి మేరకు కేసీఆర్ ప్రభుత్వం 2020 నుంచి పదవీ విరమణ వయస్సు 61కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. కానీ, రేవంత్ ప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు ఇవ్వవలసిన పెన్షన్ ప్రయోజనాలను తన టెన్యూర్‌లో ఇవ్వకుండా తప్పించుకోవడానికి మాత్రమే పదవీ విరమణ వయస్సును పెంచాలనే ఆలోచన చేస్తున్నది. ఇది మంచి పద్ధతి కాదు. అయితే, పదవీ విరమణ వయస్సు పెంపు వార్తలు రోజూ పత్రికల్లో వస్తున్నాయి.

2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఏటా 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది దాటినా 2 లక్షలేమో కానీ, కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని ప్రక్రియలను పూర్తిచేసి 45 వేల ఉద్యోగాలను సిద్ధం చేసింది. ఎన్నికల కోడ్, ఇతర న్యాయపరమైన సమస్యల కారణంగా నియామక పత్రాలను అందించలేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన 45 వేల ఉద్యోగాలకే ఇప్పుడు నియామక పత్రాలు అందిస్తూ తమ గొప్పతనంగా ప్రచారం చేసుకుంటున్నది. ఇదిలా ఉంటే మిగతా 1.50 లక్షల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయిందో చెప్పడం లేదు. అంతే కాదు, ఉద్యోగాలేవి? అని అడుగుతున్న నిరుద్యోగులను నిర్బంధిస్తున్నది. వారి ఆవేదనను, ఆగ్రహాన్ని ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణిస్తున్నది.

**పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ప్రయోజనాలు తమకు చెల్లించాలని హైకోర్టును ఆశ్రయించడం చరిత్రలో తొలిసారి. ఉద్యోగులు జీవిత కాలం పలు హోదాలలో పనిచేసి ప్రభుత్వంపై న్యాయపోరాటం చేయడం విషాదం. శేష జీవితంలో పిల్లాపాపలతో ప్రశాంతంగా జీవించాలని కోరుకుంటున్న ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మానసికంగా ఇబ్బందులు పెడుతున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రిటైర్మెంట్ ఉద్యోగుల ప్రయోజనాలను చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వ హయాం నాటి ఒక సంఘటన గుర్తుకువస్తున్నది. నాటి టీడీపీ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు 9 విడతల కరువు భత్యాన్ని నిలిపివేసింది. దీంతో పెన్షనర్లు తమ పెన్షన్ నుంచి ప్రతి ఒక్కరూ రూ.100 ఖర్చుచేసి పోస్ట్ కార్డ్స్ కొన్నారు. టీడీపీ ప్రభుత్వానికి జీవితకాలంలో ఓటు వేయొద్దని ఆ కార్డుల ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ లక్షల ఉత్తరాలు రాశారు.

**ఇక రాష్ట్ర ఉద్యోగుల పరిస్థితి అయితే మరీ దారుణంగా తయారైంది. 1వ తేదీన జీతాలు ఇస్తున్నామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనిచేయడం లేదు. పైగా దాని పేరు మీద అన్ని ప్రయోజనాలను నిలిపివేసింది. ట్రావెలింగ్ అలవెన్స్, సరెండర్ లీవ్‌తో పాటు అన్ని సప్లిమెంటరీ బిల్స్ పెండింగ్‌లో పెట్టి చేతులెత్తేసింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు మెప్మా, ఆశా వర్కర్లకు కూడా నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.**

విద్యాశాఖలో పనిచేసే ఫ్యాకల్టీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వెంటనే డీఏ చెల్లిస్తామని చెప్పి, ఒకే ఒక్క విడత కరువు భత్యం మంజూరు చేసి, మిగతా నాలుగు విడతలను ఆపేసింది. అవి ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఇక ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పీఆర్సీ వస్తుందా అనే అనుమానం ఉద్యోగుల్లో ఇప్పటికే మొదలైంది.

ఇక ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నది. ప్రభుత్వ అవలంబిస్తున్న విధానానికి, వివక్షకు నిరసనగా వచ్చే నెల ఫిబ్రవరి 9వ తేదీ నుంచి సమ్మెకు పోతున్నట్టు కార్మికులు ఇప్పటికే ప్రకటించారు.

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కంటే మెరుగైన పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలను మోసం చేసినట్టే ఉద్యోగులను సైతం మోసం చేస్తుండటం అత్యంత బాధాకరం.

(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)


**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూట్‌మెంట్ సంస్థల ద్వారా 1,62,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. అంతేకాదు, ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా పేరు గడించింది. అన్నివర్గాల ఉద్యోగులకు గణనీయంగా రెండు పీఆర్సీలలో 73 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. దేశంలోనే మొదటిసారి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 73 శాతం జీతాలు పెంచడం చరిత్రాత్మకం.**

# పోల్ అడ్డం తిరిగింది

సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు ఘోరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఎవరి పాలన కావాలంటూ కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పెట్టిన పోల్‌లో దాదాపు 70 శాతం మంది ప్రజలు కేసీఆర్ పాలన బాగుందని ఓట్లు వేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇది ఊహించని ఎదురుదెబ్బ. తన అధికారిక ట్విట్టర్‌లో ఇలాంటి ఫలితాలు రావడం ఆ పార్టీకి రెడ్ సిగ్నలే. ఇప్పుడీ పోల్ తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్ అయింది.



తోటకూర రమేశ్
98661 68676



అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, ఆగ్రహం ఉందో తాజా పోల్ నిరూపించింది. 'కాంగ్రెస్ పాలన వద్దు, కేసీఆర్ పాలన ముద్దు' అని ప్రజలు నిర్మొహమాటంగా చెప్పేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని ఎంత బలంగా కోరుకుంటున్నారో తమ ఓటుతో తెలియజెప్పారు. నిజానికి 420 హామీలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వేసిన ట్రాప్‌లో కాంగ్రెస్ చిక్కుకుంది. కాంగ్రెస్ హామీలపై గులాబీ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అయితే, బీఆర్ఎస్‌ను ప్రజల్లో బద్నాం చేసేందుకు కాంగ్రెస్ సోషల్ మీడియా ముందు రోజే అంటే జనవరి 29న తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోల్ పెట్టింది. 'ఫామ్ హౌస్ పాలన కావాలా? ప్రజల వద్దకు పాలన కావాలా?' అని పోస్ట్ పెట్టింది. ప్రభుత్వానికి పాజిటివ్‌గా తీర్పు వస్తే తన అనుకూల మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్‌పై మరింతగా రెచ్చిపోవచ్చునని భావించింది. బీఆర్ఎస్ ప్రోగ్రాం అట్టర్ ఫ్లాప్ అయిందని, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని ప్రచారం చేయవచ్చని కలలు కన్నది. అయితే కాంగ్రెస్‌వి పగటి కలలే అయ్యాయి. ప్రజలు ఇచ్చిన దిమ్మతిరిగే షాక్‌తో ప్రభుత్వానికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. అంతేకాదు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డి పాలనను సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే వ్యతిరేకిస్తున్నట్టు తాజా పోల్ రిజల్ట్ స్పష్టం చేసింది.

ప్రభుత్వ పనితీరుపై కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెట్టిన పోస్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సొంత క్యాడరే ఓటు వేశారు. దీనిని బట్టి అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సొంత పార్టీలో ఇంత అసంతృప్తి ఉంటే ఇక ప్రజల్లో ఉన్న అసంతృప్తి గురించి చెప్పనక్కర్లేదు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిపై కేసులు పెడుతుండటాన్ని గ్రహించిన ప్రజలు బాహాటంగా రేవంత్‌ను విమర్శించే సాహసం చేయలేకపోతున్నారు. దీంతో అందివచ్చిన అవకాశంలా భావించి సోషల్ మీడియాలో కాంగ్రెస్ పెట్టిన పోల్ ద్వారా ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కారు షెడ్‌కు పోయిందని, బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అని విమర్శించే కాంగ్రెస్, బీజేపీకి ఈ రిజల్ట్ చెంపపెట్టులాంటిది. తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్ బంధం ఎంతలా పెనవేసుకుపోయిందో చెప్పేందుకు ఈ ఫలితం ఒక ఉదాహరణ. పోల్‌లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం ఆ పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చినట్టు అయింది. సోషల్ మీడియాలో ప్రజలు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్‌కు వేయి ఏనుగుల బలం వచ్చినట్టు అయింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు మరింతమంది నేతలు సిద్ధంగా ఉన్నారన్న టీపీసీసీ చీఫ్‌కు కూడా ఈ రిజల్ట్‌తో గట్టి షాక్ ఇచ్చారు. బీఆర్ఎస్‌పై కూడబలుక్కుని తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌కు ఈ తీర్పు ఒక చెంపపెట్టులాంటిదే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేనంత బలహీన పడిందని బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ఇది జీర్ణించుకోలేని వార్త.

కీలకమైన సర్పంచ్ ఎన్నికల వేళ ప్రజలు ఇలాంటి తీర్పు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత చర్చలు మొదలయ్యాయి. ఎన్నికల్లో కనీసం పరువు అయినా నిలుస్తుందా? అని ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షాన్ని ఇరుకులో పెట్టబోయి కాంగ్రెస్ తానే నవ్వుల పాలైంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత వ్యతిరేకతను కాంగ్రెస్ ఊహించలేకపోయింది. మరోవైపు సోషల్ మీడియాలో జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా వేల సంఖ్యలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు వేయించే ప్రయత్నాలు చేస్తున్నది. తాజా పోల్ ఫలితాలతో పార్టీ మారాలనుకున్న చిన్నాచితక నేతలు సందిగ్ధంలో పడిపోయారు. ఈ నేపథ్యంలో ఇకపై రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నది. అధికార పార్టీ నుంచి నేతలు వలస వెళ్లినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. సొంత పార్టీలో, ప్రభుత్వంలో తిరుగుబాటు వచ్చినా రావచ్చు. ఇప్పటికే ఢిల్లీలో భట్టి, ఉత్తమ్ వంటి నేతలు పావులు కదుపుతున్నారు.

ఇంకోవైపు ఇది ప్రతిపక్షానికి ప్రజలు ఇచ్చిన మద్దతు. ఏడాది కాలంగా ప్రతి పక్షం ప్రజల పక్షాన పోరాడుతున్న తీరుకు ఇది ఒక సమర్థన. ఈ తీర్పు ప్రతిపక్షంపై మరింత బాధ్యత పెట్టింది. బరువును పెంచింది.

ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్ని హామీలైనా ఇవ్వొచ్చు. గెలిచాకే తెలుస్తుంది అసలు విషయం. ఆర్థిక పరిస్థితి అడ్డు తగులుతుంది. హామీలిచ్చినప్పుడు ఈ విషయం తెల్వదా అంటే తెలుసు, కానీ అధికారమే పరమావధిగా కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చింది. ఇప్పుడు అమలు చేయమంటే ఎగవేతలు, కోతలు, కొర్రీల ఫార్ములాను ఫాలో అవుతున్నది. అదిగో, ఇదిగో అంటూ అరచేతిలో వైకుంఠాన్ని చూపుతున్నది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిన్నమొన్ననే వచ్చినట్టు దబాయింపులకు దిగుతున్నది.

# రైతన్న ఉసురుతీస్తున్న సర్కార్



పిన్నింటి విజయ్ కుమార్
90520 39109



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాల నిలుపుదలపై చూపిన శ్రద్ధను.. తాము అధికారంలోకి రావడానికి కారణమైన ఆరు గ్యారెంటీల అమలులో చూపడం లేదు. రైతాంగానికి ఇచ్చిన హామీల అమలును పూర్తిగా గాలికొదిలేసింది. వరంగల్ నడిబొడ్డున రైతు డిక్లరేషన్‌లో ఏకకాలంలో రూ.40 వేల కోట్లు మాఫీ చేస్తామని చివరకు రూ.22 వేల కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొని నమ్మక ద్రోహం చేసింది. వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చివరికి ధాన్యం కల్లాలకు చేరేసరికి సన్నవడ్లకు మాత్రమే బోనస్ అంటూ దానిని బోగస్ హామీగా మార్చేసింది.

దేశంలోనే తొలిసారి 'రైతుబంధు' పేరుతో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించి కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక, వ్యవసాయ నిపుణుల ప్రశంసలందుకున్నది. 11 విడతల్లో ఏకంగా రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసి వారి కండ్లలో వెలుగులు నింపింది. ఆ తర్వాత ఈ పథకం కేంద్రానికి, దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమైంది. లక్షల ఎకరాలకు సాగు నీరందించడంతో పాటు పెట్టుబడి సాయం కూడా ఇవ్వడంతో రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. వేల ఎకరాలు సాగులోకి వచ్చాయి. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే, తాము రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్.. ఇస్తామన్నది ఇవ్వకపోగా, కేసీఆర్ ఇచ్చిన రూ.10 వేలు కూడా ఇవ్వకుండా రైతులను గోసపెడుతూ, రాష్ట్రాన్ని క్రమంగా విధ్వంసం వైపు నడిపిస్తున్నది.

గతంలో గెట్టు పంచాయతీల వల్ల ఎన్నో కుటుంబాలు నిలువునా చీలిపోయాయి. హత్యలు జరిగాయి. దీనికి భూ రికార్డుల్లో ఉన్న లోపాలే అసలు కారణం. ఏ భూమి ఎవరిదో తెలియదు, పట్టా ఒకరికి ఉంటే, సాగు మరొకరు చేస్తూ ఉండే. అందుకు ఉదాహరణ మా కుటుంబమే. తెలంగాణ రాక మునుపు మాకున్న 2.3 గుంటల భూమి ఎవ్వలి పేరు మీదున్నదో కూడా తెల్వదు. కానీ కేసీఆర్ ధరణి పోర్టల్ ద్వారా చేసిన భూసంస్కరణలతో ప్రభుత్వ అధికారులే భూములను సర్వే చేసి మా భూమిని మాకు ఇప్పించి పట్టా పాసుబుక్కును ఉచితంగా అందించారు. ఒక బృహత్కార్యం చేస్తున్నప్పుడు చిన్న చిన్న తప్పులు సహజం. ధరణిలో కూడా అక్కడక్కడా ఒకటో, అరో తప్పులు జరిగి ఉండవచ్చు. కానీ లక్షలాది మంది బీదాబిక్కీ రైతులకు ఈ ధరణి బాసటగా నిలిచింది. చిన్న చిన్న తప్పులను బూచిగా చూపి ధరణిపై విమర్శలు చేసిన రేవంత్.. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత నానా హంగామా చేసి ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి పేరుతో కిందామీదా చేసింది తప్ప పెద్దగా చేసింది ఏమీ లేదనేది రైతులు, భూ చట్టాల నిపుణులు, రెవెన్యూ అధికారులు చెప్తున్నారు.

**కేసీఆర్ ధరణి పోర్టల్ ద్వారా చేసిన భూసంస్కరణలతో ప్రభుత్వ అధికారులే భూములను సర్వే చేసి పేదల భూములు పేదలకు ఇప్పించి పట్టా పాసుబుక్కును ఉచితంగా అందించారు. ఒక బృహత్కార్యం చేస్తున్నప్పుడు చిన్న చిన్న తప్పులు సహజం. కానీ, వాటిని భూతద్దంలో చూడటం ఇంకా పెద్ద తప్పు.**

రైతు భరోసా అమలు విషయంలో అభిప్రాయ సేకరణ, మంత్రివర్గ ఉపసంఘం పేరుతో డ్రామాలాడి కాలాన్ని ఎల్లదీసిన సర్కారు ఎట్టకేలకు రైతు భరోసాను రూ.12 వేలతో సర్ది పెట్టుకొమ్మని తేల్చేసింది. అది కూడా ఎంపిక చేసిన గ్రామాలకు మాత్రమే. రాష్ట్రంలోని రైతులందరికీ ఏక కాలంలో ఇవ్వాల్సిన పంట పెట్టుబడి సాయాన్ని మార్చి 31 వరకు పొడిగించి కాలాన్ని సాగదీస్తూ రైతులను ఉసూరుమనిపిస్తున్నది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసాను అమలు చేయాలని యోచిస్తున్న ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రైతులు తమ ఓటుతో తప్పకుండా బుద్ధి చెబుతారు. తెలంగాణ వ్యవసాయ రంగ చరిత్రలో విప్లవాత్మక మార్పుకు కారణమైన పంట పెట్టుబడి సాయం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముమ్మాటికీ సరైంది కాదు.

ఏ సంక్షేమ పథకం విషయంలోనైనా ఆలోచించవచ్చు, కానీ రైతుకు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం విషయంలో ఇంత సంకుచితంగా ఆలోచించడం బాధాకరం. రైతు రాజ్యంగా ప్రకటనలు ఇవ్వడం కాదు.. ఆ స్థాయిలో చేతలు కూడా ఉంటే బాగుంటుంది. ఇచ్చిన రైతు భరోసా హామీని యథాతథంగా అమలు చేయాలి. లేని పక్షంలో రైతులకు క్షమాపణలు చెప్పాలి. రైతును శాసించే స్థాయికి తీసుకెళ్లకపోయినా పర్వాలేదు. కానీ మళ్లీ యాచించే స్థాయికి మాత్రం తీసుకెళ్లొద్దు.

(వ్యాసకర్త: కేయూ విద్యార్థి నేత)



170 ఏండ్లకు పైగా చరిత్ర కలిగిన భారతీయ రైల్వే దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందింది. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే, రైల్వేల విషయంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తీవ్ర విమర్శలకు కారణమవుతున్నాయి. 2017లో రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం ఇందులో ఒకటి. ప్రభుత్వం తీసుకున్న అశాస్త్రీయ నిర్ణయాల్లో దీనిని ఒకటిగా చెప్పుకోవచ్చు.

# రైల్వే బడ్జెట్ రద్దు ఒక భారీ విపత్తు!

స్వాతంత్ర్యానికి ముందు కూడా దేశంలో ప్రధాన రవాణా వ్యవస్థగా రైల్వే పేరుగాంచింది. దేశ ఆర్థికవృద్ధికి రైల్వే చోదకశక్తిగా పనిచేసింది. అయితే, రైల్వేలు ఎప్పుడూ స్వతంత్రంగా వ్యవహరించాలి. బ్యూరోక్రాట్ విధానాలకు దూరంగా ఉండాలి. అయితే, రైల్వేను వాణిజ్య సంస్థగా గుర్తించి, దానిని కేటాయించిన నిధులను శాశ్వత రుణంగా చూడటంతో పాటు ఒక్క దెబ్బతో దాని ఆర్థిక స్వయంప్రతిపత్తిని, పనితీరును దెబ్బతీసే విధానాలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేయడం అందులో ఒకటి. డివిడెండ్ చెల్లింపును రద్దు చేయడమే కాకుండా రైల్వేల హోదాను తగ్గించేశారు. ఇతర ప్రభుత్వ శాఖల మాదిరిగానే రైల్వేను కూడా పరిగణించడం మొదలుపెట్టారు. రైల్వే బడ్జెట్ అనేది రైల్వే ఆర్థిక పనితీరును, ఇతర అంశాలను వివరంగా పర్యవేక్షించేందుకు వీలు కల్పించే ఓపెన్‌బుక్. అలాంటిది దాని బడ్జెట్‌ను తొలగించి సాధారణ బడ్జెట్‌లో కలపడం ఉద్దేశపూర్వకమేనన్న విమర్శలున్నాయి. రైల్వేల జవాబుదారీతనాన్ని నీరుగార్చి తమకు నచ్చినట్టు చేయడానికే ఇటువంటి చర్యలు చేపడుతున్నట్టు ఆరోపణలున్నాయి.

రైల్వే భద్రత, ఆర్థికం, ప్రాజెక్టులపై వార్షిక మదింపు నివేదికలను గతంలో పార్లమెంటుకు సమర్పించేవారు. రైల్వే పనితీరును వివరిస్తూ, ప్రతిపక్షాల ప్రశ్నలకు రైల్వే మంత్రి సమాధానాలు చెప్పేవారు. అయితే, ఇదంతా గతానికి సంబంధించినది. ఇప్పుడు రైల్వే మంత్రికి అది పార్ట్‌టైం ఉద్యోగంగా మారింది. పార్లమెంటు సభ్యులు కూడా రైల్వేలపై జరుగుతున్న విధ్వంసాన్ని పట్టించుకోవడం మానేశారు.

**ఇప్పుడిక రైల్వేల ఆర్థిక స్వయంప్రతిపత్తి ముగిసింది. దాని ఆర్థిక అంశాలపై పరిశీలన కూడా ముగిసింది. సాధారణ బడ్జెట్‌తో రైల్వే బడ్జెట్‌ను ముడిపెట్టడం వల్ల ప్రత్యేకించి తనిఖీ చేసే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా దుబారా పెరిగింది. దీని కారణంగా భారీ మొత్తంలో నిధులు, నిరంతరాయంగా ట్రాఫిక్ డిమాండ్ ఉన్నప్పటికీ 2016 నుంచి నష్టాల్లో మునిగిపోయింది. రైల్వేలో ఇప్పుడు దుబారా, వృథా పెరిగిపోతున్నది. జవాబుదారీతనం లేని రైల్వే యాజమాన్యం బ్రాడ్‌గేజ్ వ్యవస్థ విద్యుదీకరణ కోసం విపరీతంగా ఖర్చు చేస్తుండటం ఇందుకు ఒక ముఖ్య ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2017లో ప్రారంభించిన అత్యాధునిక డీజిల్ షెడ్ సహా వేలాది డీజిల్ లోకోమోటివ్‌లు, వాటి సహాయక మౌలిక సదుపాయాలు దీనివల్ల నిరుపయోగంగా మారాయి.**

రైల్వే బడ్జెట్‌ను రద్దు చేయడం, దాని ఫలితంగా ప్రభుత్వ నిఘా లేకపోవడంతో దాని భద్రతపై ప్రతికూల ప్రభావం చూపాయనడంలో సందేహం లేదు. రైల్వే ఆస్తుల నిర్వహణ, భర్తీ, భద్రతా కేటగిరీ సిబ్బంది నియామకంలో భర్తీ చేయడం, భద్రతా పరమైన మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం వంటి ప్రధాన అంశాలపై నిర్లక్ష్యం కనిపిస్తూ ఉన్నది. అయినా రైల్వేలు రాజీ ధోరణిని అవలంబిస్తున్నాయి. రైల్వే సిబ్బంది కనుక 'వర్క్ టు రూల్'కు తగ్గట్టుగా పనిచేయాలని నిర్ణయించుకుంటే వ్యవస్థ కుంటుపడుతుందని రైల్వే యాజమాన్యం ఆందోళన చెందుతున్నది. కాంట్రాక్ట్ కార్మికులను భారీగా నియమించడం వల్ల సాంకేతిక నిర్వహణ వర్గాలలో నైపుణ్యం కలిగిన మానవశక్తి కొరత తీవ్రంగా ఏర్పడింది. ఇది భద్రతను మరింత ప్రశ్నార్థకం చేస్తుంది.

**భద్రత కేటాయింపులపై ఎటువంటి పర్యవేక్షణ లేకుండా, నిర్వహణ ఆస్తులను భర్తీ చేసేందుకు ఉపయోగించే కీలకమైన తరుగుదల రిజర్వ్ ఫండ్ (డీఆర్ఎఫ్) నిధుల కేటాయింపు గణనీయంగా క్షీణించింది. 2013-14లో రూ. 8 వేల కోట్లుగా ఉన్న నిధుల కేటాయింపు 2020-21 నాటికి రూ. 200 కోట్లకు చేరుకున్నది. చివరికి 2021-22లో జీరోకు పడిపోయింది. 'కాగ్' అంచనాల ప్రకారం 2020-21 వరకు రూ.95 వేల కోట్ల విలువైన ఆస్తులను భర్తీ చేయాల్సి ఉండగా, ఆ సమయంలో భద్రత కోసం బడ్జెట్‌ను రూపొందించడం ప్రభుత్వ ఉదాసీన వైఖరికి అద్దం పడుతున్నది. సురక్షితమైన, సరసమైన కస్టమర్ కేంద్రీకృత, పర్యావరణ స్థిరమైన రవాణాను అందించడం.. అనే రైల్వేల కార్పొరేట్ మిషన్‌ను ఈ ప్రభుత్వం స్పష్టంగా కోల్పోయింది.**

90 శాతం మందికిపైగా ప్రజలు రెండవ తరగతిలోనే ప్రయాణించే మన దేశంలో వందేభారత్, ఎయిర్ కండిషన్డ్ సేవలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టింది. ఉన్నత వర్గాల మనస్తత్వానికి ఇదొక ఉదాహరణ. 2011-12తో పోలిస్తే 2022-23లో సెకండ్ క్లాస్, నాన్ సబర్బన్ సెగ్మెంట్‌లో ఏకంగా బిలియన్ (వంద కోట్ల) మంది ప్రయాణికులు తగ్గిపోయారు. 'సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్' అనే మెరుపు వెనక క్రూరమైన పెట్టుబడిదారీ నీతి ప్రబలుతున్నది. మొత్తం మీద ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను రద్దు చేయడం ఒక అపరిమిత విపత్తు.

**- మాథ్యూ జాన్, మాజీ ఐఏఎస్ అధికారి**
'ది వైర్' సౌజన్యంతో...